ఆలయాల అభివృద్ధికి పెద్దపీట



అవుకు మండలం గడ్డమేకలపల్లెలో ప్రారంభమైన రామాలయం



పెద్దవెంతుర్ల ఎస్సీ కాలనీలో నిర్మాణంలో ఉన్న మారెమ్మ ఆలయం

- వెంకన్న ఆశీస్సులతో ధర్మపరిరక్షణే ధ్యేయంగా దేవాలయాల నిర్మాణం
- టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఒక్కో గుడికి రూ.10 లక్షలు
- జిల్లాకు రెండు విడతల్లో 16 ఆలయాలు మంజూరు

కొలిమిగుండ్ల: పురాతన ఆలయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. అదేవిధంగా కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో హిందూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించి ప్రజల్లో భక్తి భావం పెంపొందించే దిశగా టీటీడీ ముందుకు సాగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ఆలయాల నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధుల కేటాయింపు జరుగుతుంది. ఒక్కో ఆలయానికి శ్రీవాణి ట్రస్ట్ రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుంది. శ్రీవారి వైభవం నలుదిశలా వ్యాప్తి చేసేందుకు టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్, సమరసత పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ ధర్మాన్ని ప్రతిఒక్కరూ గౌరవించేలా హిందూ ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొత్త ఆలయాలు నిర్మించి నిత్యం దూప దీప నైవేద్యాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దైవాన్ని భక్తి శ్రద్ధలతో కొలుచుకోవాలని ఆశించిన వర్గాల వారికి వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పల్లెల్లోనే ఇష్టమైన దేవాలయం నిర్మించుకునే అవకాశం కల్పించింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా జిల్లాకు రెండు విడతల్లో 16 ఆల యాలకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో గడ్డమేకలపల్లె, యాగంటిపల్లె, బుగ్గానపల్లె, కమల పురి, శెట్టివీడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావ డంతో కొద్ది రోజుల క్రితం ఆలయాలను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

చురుగ్గా సాగుతున్న ఆలయాల నిర్మాణాలు

తిరుమలలోని ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రపంచంలోనే ధనిక హిందూ దేవాలయంగా ప్రసిద్ధికెక్కింది. దేశవ్యాపంగా స్వామిని దర్శించుకునేందుకు లక్షల్లో వచ్చే భక్తులు నగదు, కానుకలు భారీగా సమర్పించుకుంటుంటారు. అందుకే వెంకన్నను అపరకుబేరుడిగా పిలుస్తుంటారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత పౌండేషన్ సహకారంతో పల్లెల్లో నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ముందుగా గుడికి కావాల్సిన స్థల సేకరణ చేపడుతారు. ఆయా వర్గాలకు చెందిన 15 మందితో కమిటీ ఏర్పాటు అయ్యాక ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలను దశల వారీగా కమిటీకి చెందిన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. కొత్తగా నిర్మించే ఆలయాల్లో నిత్య పూజలు నిర్వహించేందుకు అర్చకత్వంలో శిక్షణ ఇప్పించనున్నారు. ప్రధానంగా మారు మూల గ్రామాల్లో సీతారామాలయం, వేంకటేశ్వరస్వామి, మారెమ్మ, జంబులాపరమేశ్వరి, చెన్నకేశవస్వామితో పాటు గ్రామ దేవతల ఆలయాలు నిర్మించనున్నారు. ఆలయ పనులు మొదలు పెట్టిన పది నెలల్లో పూర్తి చేసేందుకు టీటీడీ చర్యలు చేపడుతుంది. జిల్లాలో మరో 22 ఆలయాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపారు.

జిల్లాకు మంజూరైన ఆలయాల వివరాలు

మండలం	గ్రామం పేరు
కొలిమిగుండ్ల	పెద్దవెంతుర్ల
అవుకు	గడ్డమేకలపల్లె
బనగానపల్లె	యాగంటిపల్లె
నంజామల	కమలపురి
బేతంచెర్ల	బుగ్గానపల్లె
చాగలమర్రి	శెట్టివీడు
నంద్యాల	వైఎస్ఆర్ నగర్ బుడగ జంగాల కాలనీ
నంద్యాలరూరల్	పోలూరు
బండిఆత్మకూరు	కాకనూరు
ఆత్మకూరు	అమలాపురం
గడివేముల	కొరటమద్ది
జూపాడుబంగ్లా	మండ్లం
జూపాడుబంగ్లా	తర్తూరు
మహానంది	గాజులపల్లె
రుద్రవరం	కోటకందుకూరు
కోవెలకుంట్ల	చిన్నకొప్పెర్ల

హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఆలయాల నిర్మాణం



హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఆలయాల నిర్మాణం సాగుతుంది. ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో చాలా వరకు హిందూ ఆలయాలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్, సమరసత ఆధ్వర్యంలో కొత్తగా ఆలయాలు నిర్మాణాలు సాగుతున్నాయి. ఆలయాలు నిర్మాణం పూర్తయ్యాక అక్కడే బాల వికాస కేంద్రాలు ఏర్పాటు చేసి పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రతి రోజు రెండు గంటల పాటు కార్యక్రమాలు చేపడుతాం. జిల్లాలో ఆలయాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. – శ్రీనివాసులు, సమరసత సేవా పౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన రాజేష్

డోన్ : రాజా కాంప్లెక్స్ యాజమాన్యం, దివంగత జనార్దన్‌గౌడ్, జయలక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాయలసీమ క్లస్టర్ యూనివర్సిటీ ఈసీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడ్, మల్లికార్జునగౌడ్, రాజా, మహేష్‌గౌడ్, రోటరీ క్లబ్ సభ్యులు రాజయ్యగౌడ్, రఘురాములుగౌడ్, చేయూత సంస్థ వ్యవస్థాపకుడు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు

డోన్ : పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరువతో నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో గుర్తించిన సమస్యలపై అధికారులతో బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 8 సచివాలయాలకు రూ.1.60కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే మరో నాలుగు సచివాలయాల పరిధిలో పనులు చేపట్టేందుకు రూ.80లక్షల విలువ పనులకు టెండర్లు వేయడం జరిగిందన్నారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి చిదంబర స్వామి ఆరాధనోత్సవాలు



వరచిదంబర స్వామి సమాధి

డోన్ టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న శ్రీపొలికి వర చిదంబరస్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 23, 24తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజులపాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కర్నూలుకు చెందిన ఆనంద్ వెంకటేశ్వర్లుచే సత్సంగ కార్యక్రమం, 24వ తేది రాత్రి భజన పోటీలు ఉంటాయన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం జిల్లా నాయకులు సుధాకర్, బాలవెంకట్ అన్నారు. కేంద్రం తీరుకు నిరసిస్తూ బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో ఆ పార్టీ నాయకులు ప్రచారభేరి నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానిలాంటి బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములమ్మ, మురళీమోహన్, జోసఫ్ పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సరీ విరాళం



పంచాయతీ కార్యాలయానికి వాటర్ డిస్పెన్సరీ అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: డోన్ ఇన్నర్‌వీల్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు జామియా మసీదుకు బుధవారం వాటర్ డిస్పెన్సరీలను విరాళంగా ఇచ్చారు. మాజీ సర్పంచ్ గౌసియా బేగం, అంకిరెడ్డి దంపతులు, ఇన్నర్ వీల్ క్లబ్ ఫౌండర్ రాజా సుజాత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ పవిత్ర మాసంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం జామియా మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యు లు విజయలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా డెమో రైలు రద్దు

డోన్ టౌన్ : డోన్ నుంచి కర్నూలుకు వెళ్లే మార్గంలో ఉన్న బోగోలు రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాక్ మరమ్మతుల కారణంగా డెమో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డోన్ స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. నంద్యాల నుంచి కర్నూలుకు వయా డోన్ మీద వెళ్లే 07498, కర్నూలు నుంచి డోన్ మీదుగా గుంతకల్ వెళ్లే డెమో రైళ్లను గురువారం నుంచి ఈ నెల 28వ తేది వరకు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. నంద్యాల నుంచి వచ్చే రైళ్లు డోన్ వరకు వచ్చి అక్కడి నుండి పాత కాలమానం ప్రకారం గుంతకల్‌కు వెళ్తాయన్నారు. అలాగే డోన్ – గుంటూరు, గుంటూరు– డోన్ రైళ్లు (నంబరు17227–17228) డబుల్‌లైన్ పనుల కారణంగా గతంలోనే చిన్న మల్కాపురం, రంగాపురం గ్రామాల్లో ఆగకుండా తీసుకున్న నిర్ణయాన్ని పొడిగిస్తూ ఈ నెల 30వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మంటలార్పే తీరును ప్రదర్శనతో వివరిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: ప్రైవేట్, ప్రభుత్వ వైద్యశాలల్లో అనుకోకుండా జరిగే అగ్నిప్రమాదాల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె అగ్నిమాపక శాఖ అధికారి నరసింహులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. నరసింహులు మాట్లాడుతూ వైద్యశాలల్లో అగ్నిప్రమాదాలను నివారించే పరికారలను అందు బాటులో ఉంచుకోవాలని, ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు, గ్యాస్ ఫైర్ సంభవిస్తే వాటిని అగ్నిమాపక పరికరాల ద్వారా ఎలా నివారించాలో ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది శివశంకర్ రెడ్డి, శ్రీనివాసులు, కాశీశ్వరుడు, హాజీబాషా, రాజశేఖర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ టౌన్ : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామిగౌడ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

వంతెన పరిశీలించిన ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ



వంతెన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, డీఈఈ

బనగానపల్లె: మండలంలోని చిన్నరాజుపాళెం గ్రామ సమీపంలో ఉన్న పురాతన ఆర్‌అండ్‌బీ వంతెనను బుధవారం ఆర్‌అండ్‌బీ ఎస్ఐ నాగరాజు, డీఈఈ సునీల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఈ వంతెన దగ్గర ప్రమాదాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషితో నూతన వంతెన నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ హుస్సేన్, అవుకు మండడల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన కండిటి నారాయణస్వామి బుధవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ సుబ్బరాజు గ్రామానికి చేరుకొని వైఎస్ఆర్‌బీమా పథకం కింద అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతుడి భార్య నాగమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, టీసీ వెంకట్రాముడు, డాక్టర్ దస్తగిరి, పంచాయతీ కార్యదర్శులు రాఘవరెడ్డి, వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, వలంటీర్ అంజలి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఫిరోజ్

అవుకు: ప్రస్తుత్తం ఎండల తీవ్రత అధికంగా ఉందని ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఫిరోజ్ అన్నారు. మండల పరిధిలోని వేములపాడు పాఠశాలలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన ఆయన అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ఎండలు మండుతున్నాయని, సాధ్యమైనంత వరకు బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా జాగ్రత్తలు పాటించాలని, త్వరగా ఇళ్లు చేరుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు కమాల్ సాహెబ్,తెరిసమ్మ, విజయ రమేష్,హెచ్ఎం నందీశ్వర రెడ్డి, సిహెచ్‌ఓ నాగలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి

బనగానపల్లెరూరల్: ఎంఐఎం నియోజకవర్గ బనగానపల్లె ఇన్‌చార్జ్ మహ్మద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో బుధవారం రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలో పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ జరిగింది. నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి చేతుల మీదుగా మహిళలకు చీరలు అందజేశారు.

రంజాన్ తోఫా పంపిణీ

బనగానపల్లె సహారా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎస్ అబ్బాస్‌హుస్సేన్ రంజాన్ మాసం పురస్కరించుకుని బుధవారం పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎస్ఎంబీ ఖాజాహుస్సేన్, సమివుద్దీన్, ఫైజుల్లా, హాజీవలి, జిలాన్, మహబూబ్ బాషా, మోడీ మార్కెటింగ్ మేనేజర్ అన్వర్, కలాం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

బేతంచెర్ల: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ది బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను బుధవారం పంపిణీ చేశారు. దాతల సహకారంతో తమవంతు బాధ్యతగా 350 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేసినట్లు ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం సమీపంలో 11కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, గార్లదిన్నె, మాధవరం తదితర గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలలో ఊడిన పైకప్పు పెచ్చులు

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. హెచ్ఎం గది పక్కనే ఉన్న గదిలో ఒక్కసారిగా పెచ్చులూడి పడ్డాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ పెచ్చులూడుతున్నాయని పాఠశాల సిబ్బంది తెలిపారు. కాగా బాలుర ఉన్నత పాఠశాలలో మన బడి నాడు నేడులో భాగంగా కొత్త తరగతి గదుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అనాథ మహిళకు అంత్యక్రియలు

బేతంచెర్ల: పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డులోని ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న షేక్ ఇమాంబి(56) అనే మహిళ కల్లు తిరిగి పడిపోవడంతో గమనించిన స్థానికులు బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె అనాథ కావడంతో ఆరోగ్య సిబ్బంది, పోలీసులు ఆ నల్లురు వ్యవస్థాపకుడు వన్నూర్ బాషాకు అంత్యక్రియలు నిర్వహించాలని తెలిపా రు. దీంతో ఆ నల్లురు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యు లు ఆమె మృతదేహాన్ని ముస్లిం శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, యూసుఫ్, నాగరాజు, అక్బర్, సద్దాం, మహేష్ పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేషన్‌కు స్పెషల్ డ్రైవ్

డోన్ టౌన్: ఆధార్ కార్డు అప్‌డేషన్ కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు ఒకటవ సచివాలయ అధికారి లక్ష్మినారాయణరెడ్డి బుధవారం తెలిపారు. బస్టాండ్ సమీపంలో ఉన్న ఒకటవ వార్డు సచివాలయంలో బుధవారం, ఈనెల 26,27 తేదీల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2010 నుంచి 2016 వరకు జారీ చేసిన ఆధార్ కార్డులను తప్పని సరిగా అప్‌డేషన్ చేసుకోవాలన్నారు. ఒరిజినల్ ఓటర్ కార్డు, బ్యాంక్ అకౌంట్, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డులో ఏదైన ఒక్కటి తీసుకోని వచ్చి రూ.50 చెల్లించి అప్‌డేట్ చేసుకోవచ్చు అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు సమాచారం అందించాలని సూచించారు.

కొనసాగిన ప్రచార భేరి

డోన్ టౌన్: కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో ఐదవ రోజు బుధవారం కొనసాగింది. పట్టణంలోని 22వ వార్డులో సీపీఎం నాయకులు విస్తృతంగా పర్యటించి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు బ్రోచర్ అందజేస్తున్న నాయకులు

ప్యాపిలి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి తెలిపారు. బుధవారం ప్యాపిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని భావించి సంక్షేమ పథకాల్లో వారికి పెద్దపీట వేస్తోందన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలను మహిళలను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ పథకాలు కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం చంద్రశేఖర్, పర్వతం వాసురెడ్డి, మధు, బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సోమశేఖర్, జాకీర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి



లచ్చన్న చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

బనగానపల్లెరూరల్: స్థానిక ఈడిగ సంఘం కార్యాలయంలో బుధవారం సర్ధార్ గౌతు లచ్చన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ(ఈడిగ) సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. దళితులకు ఆలయ ప్రవేశం, అక్షరాస్యతను పెంపొందించడంలో ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు మూల తిరుపాల్, ఈడిగ వెంకటరమణ, నందిమల్ల నరసయ్య, పెద్దనరసయ్య, నరేష్, యల్లగౌడ్, శివయ్య, రాముడుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. లచ్చన్న వర్ధంతిని పుర్కరించుకుని బుధవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైయస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, స్వాతంత్ర పోరాటంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో టీఈ రామకృష్ణగౌడ్, మద్దిలేటి గౌడ్, గుండాల నారాయణస్వామి గౌడ్,రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

- కడప రిజినల్ ఎగ్జ్యుక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్ రెడ్డి



ఆర్టీసీ డిపో పరిసరాలను పరిశీలిస్తున్న గోపినాథ్ రెడ్డి

డోన్ టౌన్: ప్రయాణికులకు మరిన్న సౌకర్యాలు కలిపిస్తామని, ఆర్టీసీని అన్నివిధాలుగా తీర్చి దిద్దుతామని కడప రిజినల్ ఎగ్జ్యుక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్ రెడ్డి అన్నారు. బుధవారం డోన్‌కు వచ్చిన ఆయన స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో, గ్యారేజీ, స్టోర్ రూమ్‌తోపాటు పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులు, సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలు ఆదరించే విధంగా బస్టాండ్‌లను తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్మికులు, సిబ్బంది కూడా ప్రయాణికుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఆర్టీసీ ఆదాయం పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. విజయవాడ సర్వీసులో లోపాలను సరి చేస్తామని, తిరుపతి బస్సు సర్వీసు ఏర్పాటుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈయన వెంట డిపో మేనేజర్ శశిభూషణ్, సిబ్బంది పుల్లయ్య, నాగాంజనేయులు నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు బాలమద్దయ్య, ధనుంజయ, సుదర్శన్ రావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఐవీ ఆర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీకి మోడల్ స్కూల్ ఎంపిక

కొలిమిగుండ్ల: కేంద్ర విద్యా శాఖ అమలు చేయనున్న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. ఈ పథకం కింద పాఠశాలలో స్మార్ట్ తరగతి గదులుగా తీర్చిదిద్దుతారని చెప్పారు. గ్రంథాలయాలతో పాటు క్రీడా సదుపాయాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చార్లెస్ డార్విన్ వర్ధంతి



డార్విన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుల

డోన్ టౌన్ : ప్రముఖ జీవశాస్త్ర పరిణామవాద సిద్ధాంత కర్త చార్లెస్ డార్విన్ వర్ధంతిని బుధవారం డోన్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పాతపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. చార్లెస్ జీవిత చరిత్రను హెచ్ఎం విద్యార్థులకు వివరించారు. అలాగే సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ తారకరామనగర్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్లో ఆయన చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్

బేతంచెర్ల: చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, ఎంఈడీయూలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 17వ తేదిలోగా సరుకులు పంపిణీ చేయాలని, స్టాక్ వివరాలను డీలర్లకు అప్పజెప్పాలన్నారు. అలాగే సరుకుల పంపిణీని ఆయా గ్రామాల వీఆర్వోలు పర్యవేక్షించాలన్నారు.

భూగర్భజలాల పెంపునకు కృషి చేయండి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లోని కుంటలలో పూడిక తీసి భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలోని సాంపుర కుంటలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ వెంగన్న, ఏపీఓ శేషన్న పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభానికి కంతా ఊరకుంటలో పూడికతీత పనులు పూర్తి చేయాలని వారు సూచించారు. ఎండలు మండుతున్నందున ఉదయం 6గంటలకు వచ్చి10 గంటలకు పూర్తి చేసుకోవాలని కూలీలకు ఎంపీడీఓ సూచించారు.